క్లుప్తంగా

'ప్రాథమిక' చిన్నారులను సిద్ధం చేయాలి



కాకుమాను: అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే చిన్నారులను సంసిద్ధం చేయాలని నోడల్ అధికారిణి శ్రీవాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సపోర్టింగ్ ఆంధ్ర లెరనింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి అంగన్‌వాడీ విద్యను ముగించుకుని ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రతి కార్యకర్త సిద్ధం చేయాలని ఆమె సూచించారు.అలాగే కేంద్రాలలో కార్యకర్తలతో పాటు ప్రతి రోజు చిన్నారులచే చిన్న చిన్న యోగాసనాలు చేయించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, సుధారాణి, కాకుమాను సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ,కాకుమాను,పొంద్రపాడు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం ఆహార నియమాలు పాటించాలి

రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య



గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆహార నియమాలు పాటించాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ టి సంధ్య తెలిపారు. శనివారం గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ కళాశాల జ్ఞానమ్మ క్లబ్ కమిటీ విద్యార్థులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛంద సేవలు, ఆహారం ఆరోగ్యంపై అవగాహన ప్రత్యక్షంగా చూపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. చిన్నారులు జంక్‌ఫుడ్ తీసుకోరాదని, ఫాస్ట్‌ఫుడ్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. పండ్లు, బిస్కెట్లను విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆర్.షారోన్‌రోజ్, జె.ప్రమీలారాణి, ఎల్.మేరి అనూష, సిస్టర్స్ జె.స్మిత, ప్రవల్లిక, పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



గుంటూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొని ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించి పరిసరాల పరిశుభ్రతను వివరించారు. మండలంలోని లాలుపురం, గొర్లవారి పాలెం, మల్లవరం, ఓబులు నాయుడుపాలెం తదితర గ్రామాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయా గ్రామాల కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

28 వరకు ఈకేవైసీ పూర్తి చేయాలి

తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్



పొన్నూరు: మండలంలోని రేషన్ కార్డుదారులతో ఈ నెల 28 వరకు ఈకేవైసీ పూర్తి చేయించాలని తహసీల్దార్ మహమ్మద్ జియా వుల్‌హక్ ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు రెన్యువల్ క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కార్డుదారులకు సక్రమంగా బియ్యం, సరుకులు పంపిణీ చెయాలన్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో న్యాయవాదుల నిరసనలు కొనసాగుతున్నాయి. జిల్లా కోర్టులో అడ్వకేట్స్ అమెండ్మెంట్ బిల్- 2025 అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఫెడరేషన్ తీసుకున్నా నిర్ణయంలో భాగంగా గుంటూరు జిల్లా కోర్టులో ఈనెల 24, 25 తేదీలలో న్యాయవాదులు కోర్టు విధులకు గైర్హాజరవుతున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి శనివారం తెలిపారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అక్రమార్కులకే ఉపాధి!

- ఉపాధి హామీ పథకం కింద రహదారులు గోకులం షెడ్లు, పనులు కేటాయింపు
- శ్రమశక్తి సంఘాల ఏర్పాటుతో మేట్లకు పెద్దపీట
- కార్యకర్తల జేబులు నింపడానికి మేట్లను పునరుద్ధరించిన కూటమి సర్కారు



నిర్మించిన గోకులం షెడ్డు

పొన్నూరు: గ్రామాల్లో వలసలు నివారించేందుకు, పేదల కడుపు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జాతీయ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కూటమి ప్రభుత్వం తమ పార్టీల నాయకుల జేబులు నింపేందుకు ఉపాధి హామీ నిధులను వినియోగిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటికే ఉపాధి నిధులతో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులు, మినీ గోకులం షెడ్లను మంజూరు చేసి పార్టీ కార్యకర్తలకే కేటాయించినట్లు సమాచారం. తాజాగా శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసి ఆ సంఘానికి ఒక మేట్‌ను నియమించి గౌరవ వేతనం అందించేందుకు చర్యలు తీసుకుంది.

మేట్‌ల వ్యవస్థతో అక్రమాలకు చోటు

ఉపాధి పనుల్లో 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. జన్మభూమి కమిటీల జోక్యంతో ఉపాధి పనుల్లో నిధులు స్వాహా చేశారని గతంలో కూలీలే చెప్పుకున్నారు. నాడు కూడా శ్రమ శక్తి సంఘాలు, మేట్‌లను ఏర్పాటు చేసి దోచిపెట్టారు. కొందరు మస్టర్లు వేయకుండానే పనులు చేయించడం, కొన్ని చోట్ల పనులు చేయకుండానే బిల్లులు చేసుకొని జేబులు నింపుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాగా ఇప్పటికే కొందరు బోగస్ మస్టర్లుతో కూలీల పొట్ట గొడుతున్నారని ఉన్నతాధికారులు నిర్వహించే ఆడిట్ సభల్లోనే నిర్ధారణ అవుతోంది. శ్రమశక్తి సంఘం లీడర్‌ను మేట్ అంటారు. కూలీలను పనికి తీసుకెళ్లే బాధ్యత మేటీదే. ఆయన కూడా కూలీలతో పాటు పనిచేయాల్సిందే. కానీ వీరు కూలీ చేయకుండానే వేతనం పొందుతారు. పొన్నూరులో తమ కార్యకర్తలనే మేట్‌లుగా ఎంపిక చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పలువురు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమ వర్గీయులను నియమించుకున్నారు. ఇక కూలీలపై మేట్ల పెత్తనం జరగనుంది. రోడ్లు, గోకులం షెడ్లు కూడా కేవలం కూటమి సానుభూతి పరులకు మాత్రమే కేటాయించారనే చర్చ గ్రామాల్లో జరుగుతుంది.



తాళ్లపాలెంలో పొలం గట్టు పనులు చేస్తున్న కూలీలు

అక్రమాలకు చెక్ పెట్టిన 'జగనన్న'

ఉపాధి హామీ పనుల్లో జరిగే అక్రమాలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. 2019 వరకు ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు శ్రమ శక్తి సంఘాలు, మేట్‌ల వ్యవస్థను రద్దు చేయడంతో పనులు పారదర్శకంగా జరిగాయి. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ శ్రమశక్తి సంఘాలు ఏర్పాటై, మేట్ల వ్యవస్థ ఏర్పాటైంది.

మండలంలో ఉపాధి హామీ పథకంలో 22 సీసీ రోడ్డు పనులు రూ.1.45 కోట్లతో జరుగుతున్నాయి. సుమారు. రూ.2.30 లక్షలతో 27 మినీ గోకులం షెడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటితో పాటు ఇంకుడు గుంటలు, పొలాల్లో కుంటలు, కంపోస్టు ఫిట్ వంటి పనులు మంజూరయ్యాయి.

పొన్నూరులో శ్రమశక్తి సంఘాలు, మేట్‌ల వివరాలు..

పనులు జరుగుతున్న గ్రామాలు	24
శ్రమ శక్తి సంఘాలు	44
నియామకమైన మేట్‌లు	44
కూలీలు	1294
పురుషులు	663
మహిళలు	671



వల్లభరావుపాలెంలో రోడ్డు నిర్మాణం

44 సంఘాల ఏర్పాటు



శ్రమ శక్తి సంఘాల నియామక ప్రక్రియ జరుగుతుంది. 30 నుంచి 50 మంది కూలీలకు ఒక సంఘం ఏర్పాటు చేసి లీడరుగా మేటీని నియమిస్తాం. ఇప్పటి వరకు 44 సంఘాలు ఏర్పాటు చేశాం. ఉపాధి హామీ పనులను అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీడీఓ, పొన్నూరు

వ్యవసాయంలో డ్రోన్ వినియోగంతో డబ్బు ఆదా

రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వేంకటేశ్వరరావు



డ్రోన్‌ల వినియోగాన్ని ప్రత్యక్షంగా తెలుసుకుంటున్న రైతులు, విద్యార్థులు

గుంటూరు రూరల్: వ్యవసాయంలో డ్రోన్‌లను వినియోగించటం ద్వారా సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని రైతునేస్తం పౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో ఉన్న రైతునేస్తం ఫౌండేషన్‌లో వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగంపై రైతులు, వ్యవసాయ విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగుకు చీడపీడల నివారణ ప్రధాన సమస్యని, వాటిని నివారించటానికి ఉపయోగించే పరికరాల్లో పెనుమార్పులు సంభవించాయన్నారు. గతంలో రైతులు చేతితో లాగుతూ ఉండే పరికరం ద్వారా చీడపీడల నివారణకు పిచికారీ చేస్తూ ఉండేవారు. అది మారిపోయి తైవాన్‌దేశంలో ఉపయోగించే తైవాన్ స్ప్రేయర్‌ను వినియోగించారు. నేడు అవసరాలు, సమయం డబ్బు ఖర్చులను పరిశీలిస్తే తక్కువ సమయంలో డబ్బును ఆదా చేసుకుంటూ విత్తనాలు విత్తుకునేందుకు, పురుగు మందులు చల్లుకునేందుకు, ఎరువులను చల్లుకునేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారని తెలిపారు. దీనిద్వారా తక్కువ సయంలో తక్కువ పెట్టుబడితో పూర్తవుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయంలో డ్రోన్ వినియోగం తప్పనిసరన్నారు.

కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో డ్రోన్ వినియోగాన్ని ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో వడ్లమూడి విజ్ఞాన్ కాలేజీ వ్యవసాయ విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎల్.గీతాంజలి, డాక్టర్ శ్రీనివాస్, టీచింగ్, రీసెర్చ్ అసిస్టెంట్ కె.తేజశ్రీ, వ్యవసాయశాఖ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ కె రామచంద్రం పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ డి.రవీంద్రనాథ్

చేబ్రోలు: మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు దంతాల సంరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో సిబార్ వైద్యశాల వైద్యుల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దంతాల పరిరక్షణకు సంబంధించి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో సిబార్ దంత కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్ దంత సమస్యలను నివారించటానికి, సమర్థవంతమైన నోటి పరిశుభ్రత, పరిరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు, ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీపతి, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు ఈదర శ్రీనివాసరావు, దేవయజనం మురళీకృష్ణ, జోనల్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణ చంద్, కొల్లి రాజేంద్రప్రసాద్, జెట్టి సుధీర్ తదితరులు పాల్గొన్నారు. హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేలలో సేంద్రియ కర్బనం పెరగాలి

రిటైర్డ్ వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రం

గుంటూరు రూరల్: నేలలో తగిన మోతాదులో సేంద్రియ పదార్థం ఉన్నట్లయితే జీవజాలం తగిన మోతాదులో ఉండడానికి అవకాశం ఉంటుందని రిటైర్డ్ వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రం తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం పౌండేషన్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులకు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం పంటల సాగులో ఉపయోగించే రసాయనాల వల్ల నేలలో ఉండే సూక్ష్మజీవులు నశించిపోతున్నాయన్నారు. నేలలో సేంద్రియ పదార్థం తక్కువగా ఉందని, సేంద్రియ పదార్థాన్ని పెంచడానికి అవసరమైన చర్యలైన పచ్చిరొట్ట పైర్లు వేయడం, వ్యవసాయ వ్యర్థాలను భూమిలో కలియదున్నడం, సేంద్రియ ఎరువులు ఉపయోగించడం లాంటి చర్యలు చేపట్టి క్రమంగా సేంద్రియ పదార్థాన్ని పెంచుకుంటూ పోతేనే సేంద్రియ సాగు విజయవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రక్షణ బాధ్యత డ్రైవర్లదే



శిక్షణ ముగించుకున్న వారితో ఎం. రవికాంత్

పట్నంబజారు: రోడ్డు భద్రతా నియమాలను డ్రైవర్లు పాటించటం ద్వారానే ప్రయాణికులకు సురక్షితంగా గమ్యాన్ని చేర్చగలరని ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం. రవికాంత్ చెప్పారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ ముగించుకున్న 18వ బ్యాచ్ వారికి ధ్రువీకరణ పత్రాలను ఆయన శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లోని డ్రైవింగ్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో అందించారు.

ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేసే సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ప్రయాణికుల రక్షణ బాధ్యత డ్రైవర్‌లపై ఉందన్నారు. 19వ బ్యాచ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 88973 71003 ఫోను నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిపో 2 మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ షేక్ అబ్దుల్‌సలాం తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు సిద్ధమవుతున్న క్వారీ



మహాశివరాత్రి సందర్భంగా క్వారీ తిరునాళ్లకు ముస్తాబైన దేవాలయం

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు వచ్చే భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమవుతున్నాయి. చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా పరిసర గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలతో పాటు చిన్నచిన్న ప్రభలు వందల సంఖ్యలో వస్తుంటాయి. నారాకోడూరులో నాలుగు భారీ విద్యుత్ ప్రభలు రూపుదిద్దుకుంటున్నాయి. సుద్దపల్లి, గొడవర్రు, గుండవరం, చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల నుంచి భారీ ప్రభలు తరలిరావటానికి తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. క్వారీ దేవాలయం వద్ద భక్తుల కోసం అన్ని శాఖల అధికారుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ విద్యుత్ ప్రభలు సుమారు 5 లక్షల నుంచి 10 లక్షల వ్యయంతో రూపుదిద్దుకుంటున్నాయి. గత 90 సంవత్సరాలుగా దేవాలయానికి భక్తులు ప్రభలు నిర్మించుకు రావటం ఆనవాయితీగా ఉంది. దేవాలయం పరిసర భూములు క్వారీలుగా మారటంతో పాటు దేవాలయం చుట్టుపక్కల గోడలు నిర్మించటంతో దేవాలయం చుట్టూ వాహనాలు రాకపోకలు సాగించడానికి కొంత ఇబ్బంది ఏర్పడుతున్నది. దేవాలయం వద్దకు వ్యాపారాలు నిర్వహించుకోవటానికి చిల్లర వ్యాపారులు తరలివస్తున్నారు. జెయింట్ వీల్, రంగులరాట్నాలు, ట్రైన్స్, తదితర ఏర్పాట్లు చేసుకున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సుద్దపల్లి, నారాకోడూరు, శలపాడు గ్రామాలకు చెందిన ప్రొక్లెయినర్ యజమానులు, లారీ యజమానులు క్వారీ బాలకోటేశ్వర స్వామికి పూజలు నిర్వహించిన అనంతరమే పనులు ప్రారంభిస్తుంటారు.



నారాకోడూరులోని తెనాలి రోడ్డులో ముస్తాబవుతున్న భారీ విద్యుత్ ప్రభ

సమష్టి కృషితోనే విజయం సాధ్యం

భాష్యం డీన్ బి.హరిబాబు



విన్నర్స్ ట్రోఫీలతో క్రీడాకారులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మశీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న సీఎల్‌పీటీ మిలానోత్సవ్ 4.0 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భాష్యం విద్యాసంస్థల డీన్ బి.హరిబాబు మాట్లాడుతూ గెలవాలనే తపన ఉంటే జీవితంలో ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా అధిగమించవచ్చని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 16 కళాశాలల నుండి 534 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. వాలీబాల్ మెన్ కేటగిరీలో కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల మొదటి స్థానం, చలపతి ఫార్మసీ కళాశాల రెండవ స్థానం కైవసం చేసుకున్నారన్నారు. కబడ్డీ మెన్ క్యాటగిరీలో చలపతి ఫార్మసీ కళాశాల మొదటి, అన్నమాచార్య ఫార్మసీ కళాశాల రెండవ స్థానం గెలుపొందారు. త్రోబాల్ ఉమెన్స్ కేటగిరీలో మొదటి బహుమతి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల, రెండవ స్థానం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల గెలుపొందారు. కబడ్డీ ఉమెన్స్ కేటగిరీలో మొదటి బహుమతి కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ, రెండో బహుమతి చలపతి ఫార్మసీ కళాశాలలు గెలుచుకున్నారు. క్యారమ్స్ డబుల్స్ మెన్స్ క్యాటగిరీలో మొదటి బహుమతి లాం చలపతి ఫార్మసీ కళాశాల, రెండో బహుమతి మోతడక చలపతి ఫార్మసీ కళాశాల గెలుచుకున్నారు.

క్యారమ్స్ డబుల్స్ ఉమెన్స్ క్యాటగిరీలో మోతడక చలపతి ఫార్మసీ కళాశాల మొదటి, లాం చలపతి ఫార్మసీ కళాశాల రెండవ బహుమతులను గెలుచుకున్నాయి. చెస్ మెన్స్ క్యాటగిరీలో మొదటి బహుమతి సిమ్స్ ఫార్మసీ కళాశాల, చలపతి ఫార్మసీ రెండవ బహుమతి సాధించారు. చెస్ ఉమెన్స్ క్యాటగిరిలో కేవిఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల మొదటి, చలపతి ఫార్మసీ రెండవ బహుమతులను సొంతం చేసుకున్నాయి. షార్ట్ పుట్ మెన్స్ క్యాటగిరిలో మొదటి, రెండవ బహుమతి చలపతి ఫార్మసీ కళాశాల, మూడవ బహుమతి మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కళాశాల, నాల్గవ బహుమతి బాపట్ల ఫార్మసీ కళాశాల దక్కించుకున్నారు. షాట్ పుట్ ఉమెన్స్ క్యాటగిరిలో మొదటి బహుమతి చలపతి ఫార్మసీ కళాశాల, రెండవ బహుమతి కేవిఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, మూడవ బహుమతి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలను వరించాయి.

రన్నింగ్ రేస్ మెన్స్ క్యాటగిరీలో మొదటి బహు మతి కెసి రెడ్డి కళాశాలకు, రెండో బహుమతి అన్నమాచార్య ఫార్మసీ కళాశాలకు, మూడవ బహుమతి మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కళాశాల అందుకున్నారు. రన్నింగ్ రేస్ ఉమెన్స్ క్యాటగిరిలో మొద టి, రెండవ బహుమతులు విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల గెలుపొందారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ విన్నర్స్‌గా చలపతి ఫార్మసీ, రన్నర్స్‌గా కేవిఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల గెలుపొందారు. విజేతలకు అతిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా తక్కెళ్లపాడు గంగానమ్మ ఉత్సవాలు



పెదకాకాని: మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామంలోని గంగానమ్మ తల్లి వార్షిక మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. గంగానమ్మ తల్లి 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు గుంటూరు సుబ్బారావు, ఓగిరాల కోటేశ్వరరావు, నాగేంద్రం, వలివేటి నాగేశ్వరరావు తదితరులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బుర్రకథ పితామహుడు నాజర్‌కు ఘన నివాళి



పొన్నూరు: కళతో ప్రజలను చైతన్యపరిచిన బుర్రకథ పితామహుడు పద్మశ్రీ నాజర్ అని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. పొన్నూరులో స్థానిక సీపీఐ కార్యాలయంలో నాజర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు వీరరాఘవయ్య, కళాకారులు సురేష్, నరసింహారావు, టైలర్ యూనియన్ ప్రెసిడెంట్ ఎస్.కె బాబు తదితరులు పాల్గొన్నారు

పేదలకు బియ్యం పంపిణీ



పొన్నూరు: మండలంలోని కసుకర్రు గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాస్ 58వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మిత్ర బృందం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిత్రులు చెక్కా శ్రీనివాసరావు, షేక్. కరీముల్లా, షేక్ చాంద్ బాషా, ఎం. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో వార్డ్ సచివాలయాల వారీగా పక్కాగా అమలు చేయడానికి వార్డు అడ్మిన్ కార్యదర్శి నేతృత్వంలో కార్యదర్శులందరూ సమన్వయంతో కృషి చేయాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులకు స్పష్టం చేశారు. శనివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డ్ సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులతో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, వివిధ సర్వేల పురోగతిపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల విజయవంతానికి సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు సకాలంలో అందించడం, వివిధ సర్వేలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల పర్యవేక్షణ కోసం డివిజన్ల వారీగా నోడల్ నియమించిన నోడల్ అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని స్పష్టం చేశారు. అనంతరం కార్యదర్శుల వారీగా మిస్సింగ్ సిటిజెన్స్, హౌసింగ్ జియోట్యాగ్, ఎన్పీసీఐ, నాన్ రెసిడెంట్ ఇన్ ఏపీ, ఎంఎస్ఎంఈ సర్వేల పురోగతి పై వివరాలడిగి తెలుసుకొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివారావు, పి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సి.ఎం.ఓ.హెచ్.డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.